క్లుప్తంగా

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

నర్సంపేట రూరల్ : దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ రాజుకు పలువురు లబ్ధిదారులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కొంకటి రవీందర్, మామిడాల మధు, మాతంగి నరేశ్ మాట్లాడారు. తమకు దళితబంధు మంజూరైనట్లు ప్రొసీడింగ్ కాపీలు అందించారని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో సాయం నిలిచిపోయిందని, కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన క్రమంలో వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

పంట సాగులో డ్రోన్‌తో ప్రయోగం

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో పంటల సాగులో భాగంగా రైతులు డ్రోన్‌తో క్రిమిసంహారక మందు స్ప్రే చేశారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న అభివృద్ధి నేపథ్యంలో రైతులు డ్రోన్‌ను తెప్పించి ప్రయోగం చేయడం మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది. కార్యక్రమంలో పవన్, కార్తీక్, దొంతరబోయిన అంజయ్య, ముద్రబోయిన ఉప్పలయ్య, గుండె కార్తీక్, నందనబోయిన పాల్గొన్నారు.

ఘనంగా అక్షర స్కూల్ వార్షికోత్సవం

నర్సంపేట రూరల్ : పట్టణంలోని అక్షర స్కూల్ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని బిట్స్ కళాశాల ఆవరణలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరీ డాక్టర్ ఏ.వనజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుకోవడంతోపాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, పావని, దృశ్యంత్‌రెడ్డి, కీర్తన, హెచ్‌ఎం జ్యోతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

18న సదరం క్యాంపు

వర్ధన్నపేట : వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలు, మూడు మున్సిపాల్టీలకు చెందిన దివ్యాంగులకు ఈనెల 18న మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థో, మానసిక వికలాంగుల విభాగాలకు సంబంధించిన వారికి మాత్రమే పరీక్ష చేస్తారని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు, రెన్యూవల్ చేసుకునే వారికి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారని వివరించారు. దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో నేడు (బుధవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి రుసుము చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం దివ్యాంగులు నిర్దేశించిన తేదీల్లో వైకల్య ధ్రువీకరణ పత్రం, వైద్యుడి నివేదిక, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సదరం క్యాంపునకు హాజరు కావాలని సూచించారు.

చర్య తీసుకోవాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్‌లోని 121 ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజాసంఘాల జేఏసీ, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపల్లి ప్రణయ్‌దీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆర్డీఓ కృష్ణవేణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు, ప్రణయ్‌దీప్ మాట్లాడారు. సదరు ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోగా 2011లో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో హద్దులను నిర్ధారించారని చెప్పారు. కాగా గతేడాది డిసెంబర్ 21న రాత్రి రియల్టర్లు ట్రాక్టర్లతో భూమిలో అక్రమంగా మట్టి రవాణా చేశారని తెలిపారు. ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తడుగుల విజయ్, బొట్ల నరేశ్, చింతం సిద్ధూ, కొడారి రవి, కుమార్, శ్రీకాంత్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

నర్సంపేట : డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల విద్యార్థులకు మెస్ చార్జీల బకాయిలు విడుదల చేయడంతోపాటు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, డీవైఎఫ్‌ఐ నాయకుడు గడ్డమీది బాలకృష్ణ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వారు మంగళవారం వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఖానాపురం : రైతులకు అందుబాటులో మండల కేంద్రంలోని సొసైటీలో ఎరువులు ఉన్నాయని వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. స్థానిక సొసైటీ పరిధిలో సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎరువుల బస్తాలున్నాయని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


పరకాల : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


దామెర : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ


నడికూడ : ఆరె సంఘం ఆధ్వర్యంలో..

పరకాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉపాధ్యాయులు విశ్వసిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండల తిరుపతిరెడ్డి, పలీత శ్రీహరి అన్నారు. పీఆర్టీయూ 2024 క్యాలెండర్‌ను పట్టణంలోని అమరధామంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పీజీహెచ్‌ఎం సురేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొమ్మిడి రామన్న, దగ్గు తిరుపతిరావు, మంత్రి లింగమూర్తి, గోవిందు సత్యనారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు మోడెం రాజేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గొల్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు చల్లా రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 2024 క్యాలెండర్‌ను ఎంఈఓ రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి శరత్‌బాబు, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు పాకాల సుధాకర్‌రెడ్డి, జిల్లా బాధ్యుడు అశోక్, నాయకులు జనార్దన్, సోమన్న, నర్సింగరావు, శ్రీనివాస్ రెడ్డి, భగవాన్‌రెడ్డి, రామ్మూర్తి, కమలాకర్, ప్రభాషిణి, సహనలత పాల్గొన్నారు.

ఆరె సంఘం ఆధ్వర్యంలో...

నడికూడ : మండల కేంద్రంలో మంగళవారం ఆరె సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు లోకటి నగేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, కొల్లూరి కండేరావు, లింగమూర్తి, రాజు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, శివ, సంజీవరావు, పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల వితరణ


పత్తిపాక గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తూ అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

శాయంపేట : అయోధ్య రాముడి అక్షింతలను రామ మందిరం ట్రస్టు ఆధ్వర్యంలో 500మంది వేద పండితులతో పూజించి మంగళవారం శాయంపేట, ఆరెపల్లి, పత్తిపాక గ్రామాల్లో పంపిణీ చేశారు. సంయోజక్ గిద్దమారి సురేష్ అక్షింతల వితరణ చేపట్టగా ముఖ్య అతిథిగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లెక్కల జలెందర్ రెడ్డిలక్ష్మి, శ్రీరాముని తీర్థ ట్రస్టు వరంగల్ జిల్లా సహసంయోజక్ ఆర్‌ఎల్‌కే ప్రసాద్ పాల్గొని అక్షింతలు అందించారు. మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి, శ్రీసంజీవ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయాల అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రాజు అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి భక్తి గీతాలు ఆలపిస్తూ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన చేస్తు ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, గ్రామ సంయోజక్ కడారి చంద్రమౌళి, సహసంయోజక్ కానుగుల నాగరాజు, బాసాని విద్యాసాగర్, వనం దేవరాజ్, నామని శివ, ఉప్పు రాజు, రంజిత్, శ్రీనివాస్, కుమారస్వామి, రవి, రాజేష్, రాము, అశ్విత్, శివ, లావణ్య, వెంకన్న, భరత్, రాకేష్, సమ్మిరెడ్డి, నరసింహారెడ్డి, పత్తిపాక భజన మండలి సభ్యులు మాందాడి రాజు, తడక సదానందం, కూనూరు రాజు, శ్రీధర్, రవి, రమేష్, మహేందర్, ప్రభాకర్ రెడ్డి, సాంబరెడ్డి, మల్లయ్య, రాంరెడ్డి, కుమారస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సమీక్ష

పరకాల : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేడు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుపై సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. నియోజవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, డివిజన్ కోర్ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగికి బదిలీ సహజం


దుర్గాభవానిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ

వేలేరు : ప్రతీ ఉద్యోగికి బదిలీ సహజమని జెడ్పీటీసీ చాడ సరిత అన్నారు. మల్లికుదుర్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసిన దుర్గాభవాని ఎల్కతుర్తి పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ బాల్లె వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోవింద సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. 5లక్షల బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్సై దేవేందర్, సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఎయిర్‌టెల్ ప్రమోటర్ నాగూర్ వలీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును మంగళవారం ఎస్సై దేవేందర్, ఆ బ్యాంకు జోనల్ మేనేజర్ శంకర్, లిక్కి నర్సింగ్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కుమారస్వామి, రవికాంత్, రఫీ, డిస్ట్రిబ్యూటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా మల్లన్న పట్నాలు


నృత్యం చేస్తున్న శివసత్తులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న కొమురవెల్లి మల్లన్న పట్నాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సినీ నిర్మాత గద్ద కుమారస్వామి ఆధ్వర్యంలో యాదవ కులస్తులు పట్నాలు పెద్దెత్తున నిర్వహిస్తున్నారు. డోలు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాల నడుమ స్వామివారి పట్నాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆర్కాల మల్లయ్య, ఎర్ర సమ్మయ్య, గిరిజనవారి మల్లయ్య, ప్రసాద్, నరేష్, కుమారస్వామి, మహేందర్, తదితరులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి


మెమొంటోలు అందజేస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూరు : ఎయిడ్స్ నిర్మూలనలో అందరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎయిడ్స్ నిర్మూళలపై మంగళవారం అవగాహన కల్పించారు. వైఆర్‌జీ కేర్ లింగ్ వర్కర్ లింగ్ స్కీం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, మెమొంటోలు ప్రదానం చేశారు. ఎయిడ్స్ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతగిరి రాజు, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి యాదగిరి , ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించిన ఎంపీపీ

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గుకు కటాక్షపూర్ చెరువు వద్ద రూ.29లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులను ఎంపీపీ మార్క సుమలతరజనీకర్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు చేపట్టామన్నారు.

డీసీసీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న రవీందర్‌గౌడ్

ఆత్మకూరు : డీసీసీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీసీసీ బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. వాహనాలు కొనుగోలు చేసేందుకు డీసీసీ బ్యాంకులో రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు నేతృత్వంలో బ్యాంకు వివిధ రకాల రుణాలను ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిత, మేనేజర్ శ్వేత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జనగాం ప్రభాకర్‌గౌడ్, డైరెక్టర్లు బూర రాజేందర్, రేవూరి జయపాల్‌రెడ్డి, కంచ సతీష్, పుష్ప, శ్రీను, సీఈఓ ఓం ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వేలేరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మిప్రసన్న తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని, అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. మండలంలో జరిగిన అభివృద్ధి, చేపట్టనున్న పనుల పూర్తి నివేదికలను అధికారులు వెంట తీసుకురావాలని సూచించారు.

దీక్షాధారులకు మహాప్రసాదం అందజేత


స్వాములకు అన్నదానం చేస్తున్న ఖాజా దంపతులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి దీక్షాధారులకు మంగళవారం కాంగ్రెస్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాజా దంపతులు మహా ప్రసాదాన్ని అందించారు. మైనారిటీ వర్గానికి చెందినప్పటికీ భక్తితో అన్నదానం చేయడం పట్ల పలువురు ఖాజా దంపతులను అభినందించారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రవిరాజు, ఎస్సై ప్రసాద్, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, సర్పంచ్ పర్వతగిరి రాజు, కార్యదర్శి యాదగిరి, సందీప్, రామకృష్ణ, రవి, సంతోష్ పాల్గొన్నారు.

తిరుపతిలో అఖండ హరినామ సంకీర్తన



శాయంపేట : మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి సభ్యులు మంగళవారం తిరుమలతిరుపతిలో అఖండ హరినామ సంకీర్తన చేశారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా భజన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సిద్దసాయిరెడ్డి, భూషబోయిన రాజు, అడప శ్రీకాంత్, బుచ్చయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రవిచంద్ర, కిష్టయ్య, రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్‌హెచ్‌ఆర్సీ లక్ష్యం

- జిల్లా అధ్యక్షుడు పూజారి సత్యనారాయణ


నియామకపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

కమలాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారమే జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు పూజారి సత్యనారాయణ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకునేలా సంస్థ తోడ్పాటు అందిస్తుందని అన్నారు. రాష్ట్ర ఈసీ మెంబర్ పాక శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం మండల కమిటీ నియామక కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పూజారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉచ్చత శ్రీకాంత్ హాజరై కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాక కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా గోల్కొండ భిక్షపతి, బొమిరి అరుణ, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రమేష్, సంయుక్త కార్యదర్శిగా నరిగె ఓదెలు, అధికార ప్రతినిధిగా మేకల రవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తామని, హక్కుల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం జరిగితే బాధితులకు న్యాయం జరిగే వరకు ఎన్‌హెచ్‌ఆర్సీ ఎల్లవేళలా ముందుటుందని తెలిపారు.

పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

ఐనవోలు : ప్రకృతి వ్యవసాయం, అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న కోరారు. మండలంలోని సింగారం గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులతో జాతీయ సేవా పథకంలో భాగంగా వివిధ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గ్రామ అవసరాలు, సమస్యలను గుర్తించి ప్రజలందరూ కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. తమలో తాము సామాజిక, పౌర బాధ్యత భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే కషాయాలను, అధిక సాంద్రత, పత్తి సాగుపై మోడల్స్ తయారు చేసి ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. నూతనంగా విడుదల చేసిన అధిక దిగుబడి, చీడపీడలను తట్టుకునే విత్తనాలను కూడా ప్రదర్శించారు. ప్లకార్డులు, చార్ట్స్ ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు గ్రామ పంచాయతీ ముందు ఉన్న చెత్తను తొలిగించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణ్, రైతు కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల చదువుతోనే సమాజ ప్రగతి


ఉపాధ్యాయురాలుని సన్మానిస్తున్న విద్యార్థులు

ధర్మసాగర్ : మహిళలు చదువుకుంటేనే సమాజానికి ప్రగతి చేకూరుతుందని తెలుగు ఉపాధ్యాయురాలు రాజమ్మ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా సమాజ ప్రగతిలో మహిళల పాత్ర అంశంపై పాఠశాల హెచ్‌ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు రాజమ్మ కీలక ఉపన్యాసం ఇచ్చారు. పురుషుడు చదువుకుంటే అతడికే ఉపయోగ పడుతుందని, కానీ మహిళ చదివితే అది వారి కుటుంబ ప్రగతికి తోడ్పడుతుందన్నారు. మహిళలు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు పొందిన గణిత ఉపాధ్యాయురాలు కిరణ్మయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంద కృష్ణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం


మాట్లాడుతున్న గద్దల సుకుమార్ మాదిగ

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణ మాదిగతోనే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ అధ్యక్షతన మండల కేంద్రంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మాదిగ యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా అందరు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పోడేటి రాజు మాదిగ, ఉపాధ్యక్షుడిగా మాట్ల రాజేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పుల్ల రవితేజ మాదిగ, కార్యదర్శిగా ప్రేమ్‌చంద్ మాదిగ, సహాయ కార్యదర్శిగా మాట్ల వెంకటేష్ మాదిగను ఎన్నుకున్నారు.

దరఖాస్తు చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్

వేలేరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో శివుడి పేరిట దరఖాస్తు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, వేలేరు ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అధికారులను కోరారు. మంగళవారం మండల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఏనుగు వెంకట సురేందర్‌రెడ్డి ఉద్దేశ పూర్వకంగా దేవుళ్లను, రాష్ట్ర ప్రభుత్వాన్ని అవహేలన చేశాడని మండిపడ్డారు. సురేందర్‌రెడ్డి వద్ద నుంచి దరఖాస్తు స్వీకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో సమయాన్ని వృధా చేసే పనులు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సలీం మాలిక్, రఫీ, రియాజ్, రాయబోస్, పాషా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నర్సంపేట: నిరుపేదల కుటుంబాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఆయన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇక నుంచి పేద కుటుంబాల్లోని యువతుల వివాహానికి రూ.లక్ష116లు నగదుతోపాటు తులం బంగారు అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలను అమలు చేస్తుందన్నారు. పేదలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.